ఈ రహదారికి మోక్షమెన్నడు?

- వర్షమొస్తే మోకాళ్లలోతు జలమయం..
- అవస్థలు పడుతున్న చిరువ్యాపారులు, ప్రయాణికులు
- పరిశ్రమల వాహనాల రాకపోకలతో మరింత దుర్భరం
- అశ్వాపురం ప్రధాన రహదారి దుస్థితి ఇది..


అధ్వానంగా ఉన్న అశ్వాపురం ప్రధాన రహదారి కూడలి..

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారం, సీతారామ ప్రాజెక్ట్, సీతమ్మసాగర్ ప్రాజెక్ట్, మిషన్‌భగీరథ పథకంతో రాష్ట్రంలోనే అశ్వాపురం మండలానికి ఎంతో ప్రత్యేకత ఉన్నా మండల కేంద్రంలో మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారి మరమ్మతులు, రహదారి విస్తరణను పట్టించుకున్న నాథుడు లేడు. మండల కేంద్రంలో ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ వ్యవస్థ లేక ఎన్నో ఏళ్లుగా చిన్న చినుకు పడినా జలమయమవుతూ వస్తోంది. మండల కేంద్రంలో వ్యాపారులు, చిరువ్యాపారులు, ప్రజలు నానా అవస్థలు పడుతూ వస్తున్నారు. వర్షాకాలం రహదారిపై నీరు నిలిచి ప్రయాణికులు, పాదచారుల అవస్థలు అంతాఇంతా కాదు.

గౌతమీనగర్ కాలనీ నుంచి అశ్వాపురం సెంటర్ వరకు ప్రధాన రహదారి గుంతలమయమై వర్షపు నీరు నిలుస్తోంది. నిత్యం మండలంలోని గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వస్తూ రహదారి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రం కూడలిలో నాలుగు వైపులా ప్రధాన రహదారి వెంబడి జలమయమై వాగును తలపిస్తూ మోకాళ్ల లోతులో నీరు ఉండిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఎన్నో ఏళ్ల సమస్య..

అశ్వాపురంలో భారజల కర్మాగారం, మణుగూరులో సింగరేణి, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్, సీతారామ ప్రాజెక్ట్, సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ లకు సంబంధించి వాహనాలు, భారీ యంత్రాల రాకపోకలకు అశ్వాపురం ప్రధాన రహదారే కేంద్రం. మండల కేంద్రంలో రెండు వరుసల రహదారి మాత్రమే ఉండటంతో వాహనాలు, ప్రాజెక్టుల యంత్రాలు, ఇసుక లారీలు, ప్రైవేటు వాహనాలతో మండల కేంద్ర ప్రధాన రహదారి నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉంటుంది. రహదారి ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రహదారిని విస్తరించాలని ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు.

ప్రారంభం ఎన్నడు?

రహదారి విస్తరణ అంశాన్ని పట్టించుకున్నవారు లేకపోగా.. ఈ రహదారికి ఇరువైపులా 2022–23 డీఎంఎఫ్‌టీ నిధులు రూ.4 కోట్లతో డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఇప్పటికి ఐదు నెలలు గడిచినా పనులు ప్రారంభం కాలేదు. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని, ప్రజాప్రతినిధులు కలుగజేసుకుని రహదారిని విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు.

పరిష్కరించకుంటే అడ్డుకుంటాం..

అశ్వాపురం: మండల కేంద్రంలో ప్రధాన రహదారి మరమ్మతులకు శాశ్వత పరిష్కారం చూపి రహదారి సమస్య పరిష్కరించకుంటే సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణ సంస్థ అయిన ఎల్‌అండ్‌టీ వాహనాలను అడ్డుకుంటామని అశ్వాపురం మండల ఐక్యవేదిక నాయకులు స్పష్టం చేశారు. అశ్వాపురంలో అస్తవ్యస్తంగా ఉన్న ప్రధాన రహదారిని ఐక్యవేదిక నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ప్రధాన కూడలిలో ప్రధాన రహదారి సీతమ్మ సాగర్ బ్యారేజీకి వెళ్లే భారీ వాహనాల వల్ల రహదారి దెబ్బతిని గుంతలు గుంతలుగా మారిందన్నారు. దీనివల్ల ఈ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిందని, ప్రభుత్వ కార్యాలయాలు, జూనియర్ కళాశాల, పీహెచ్‌సీ, మార్కెట్‌కు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎల్‌అండ్‌టీ అధికారులు స్పందించి ప్రధాన కూడలిలో రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. ఐక్యవేదిక అధ్యక్ష, కార్యదర్శులు కూరపాటి చలపతిరావు, తుశ్లారి ప్రకాష్‌రావు, నాయకులు భూక్యా చందూలాల్, ఓరుగంటి భిక్షమయ్య, బొబ్బాల నాగేశ్వరరావు, గద్దల నాగేశ్వరరావు, గద్దల రామకృష్ణ, భాగవతపు సతీష్, రాయపూడి రాజేష్, సంపత్, వెంకటరమణ పాల్గొన్నారు.

రహదారిని విస్తరించాలి..



పరిశ్రమలు, ప్రాజెక్టులతో ఈ ప్రాంతం దినదినాభివృద్ధి చెందుతున్నా అశ్వాపురంలో ప్రధాన రహదారి విస్తరణను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రహదారిని విస్తరించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారి విస్తరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

– బాణోత్ శారద, అశ్వాపురం సర్పంచ్

ప్రజలు ఇబ్బంది పడుతున్నారు..



రహదారి కేవలం రెండు వరుసల రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలతో రహదారి ఇరుకుగా ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సింగరేణి, బీటీపీఎస్, సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ వాహనాలతో రహదారి రద్దీగా, ఇరుకుగా ఉండి ప్రమాదాలు జరుగుతున్నాయి.

– తుశ్లారి ప్రకాష్‌రావు, టీడీపీ మండల అధ్యక్షుడు, అశ్వాపురం

డ్రెయినేజీ నిర్మించాలి



మండల కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ వ్యవస్థ లేక నీరు నిలుస్తోంది. డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్ నిర్మాణానికి మంత్రి, ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి ఐదు నెలలు గడిచినా పనులు చేపట్టడం లేదు. వెంటనే పనులు చేపట్టి రహదారి విస్తరించాలి.

– ఓరుగంటి భిక్షమయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, అశ్వాపురం

నాణ్యతలో రాజీపడొద్దు


రహదారి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని సున్నంబట్టి నుంచి తిరుమలకుంట గ్రామానికి వెళ్లే బీటీ రహదారి నిర్మాణ పనులను బుధవారం స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆకస్మికంగా పరిశీలించారు. సున్నంబట్టి–తిరుమలకుంట గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్ల 50లక్షల రూపాయలను కొద్ది రోజుల క్రితం ఎమ్మెల్యే మంజూరు చేయించగా.. ఈ పనులను కాంట్రాక్టరు చేపట్టాడు. పనులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి.. నాణ్యత విషయంలో రాజీపడితే సహించేది లేదని, అధికారులు పనులను పర్యవేక్షించాలని అన్నారు. కార్యక్రమంలో దమ్మపేట జెడ్పీటీసీ సభ్యుడు పైడి వెంకటేశ్వరరావు, జిన్నా ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

దమ్మపేట: యువకుల క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. బుధవారం మండలంలోని నాగుపల్లి గ్రామంలో, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం అదే గ్రామంలో ఇటీవలే మృతి చెందిన పాలగాని నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ భాస్కరరావు, బీఆర్ఎస్ నాయకులు దారా యుగంధర్, కందిమళ్ల లక్ష్మీనారాయణ, సర్వేశ్వరరావు, మాధవచారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి

దమ్మపేట: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థానిక బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి హాజరై మాట్లాడుతూ.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాచే ఆమోదం పొందిన సంస్థల్లోనే డిపాజిట్లు చేయాలని, ఓటీపీ, ఏటీఎమ్ పిన్ నంబర్ తదితర వివరాలు ఎవరికీ చెప్పకూడదని సూచించారు. ఆన్‌లైన్‌లో మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో దమ్మపేట మేనేజర్ రవికుమార్, ఉప సర్పంచ్ దారా యుగంధర్, బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కోట కాదు.. చీమల పుట్ట


కావడిగుండ్ల అటవీ ప్రాంతంలో 12 అడుగుల చీమల పుట్ట

అశ్వారావుపేటరూరల్: చీమల పుట్టలు సాధారణంగా మూడు నుంచి నాలుగు అడుగుల ఎత్తులో ఉండటం మామూలే. కానీ ఈ పుట్ట ఏకంగా పన్నెండు అడుగుల ఎత్తులో పెరిగి, మట్టి కోటను తలపిస్తోంది. అశ్వారావుపేట మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన కావడిగుండ్ల అటవీ ప్రాంతంలో చీమల పుట్టలు పదుల సంఖ్యలో ఉన్నాయి. కాగా వీటిలో ఓ పుట్ట మాత్రం సుమారు 12 అడుగుల ఎత్తు దాకా పెరిగింది. ప్రధాన రహదారికి దగ్గర్లో ఉన్న ఈ ఎత్తైన పుట్ట అటువైపుగా వెళ్లే వారిని ఆకట్టుకుంటోంది. దీనిని చూసిన వారంతా చీమల కోటలా ఉందే అంటూ.. ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఆ పుట్టను బుధవారం 'సాక్షి'తన కెమెరాలో క్లిక్ మనిపించింది.

ఆదివాసీ నాయకుడికి ఘన నివాళి

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని సున్నంబట్టి గ్రామానికి చెందిన ఆదివాసీ నాయకుడు వగ్గెల కృష్ణమూర్తి(75) అనారోగ్యంతో మృతిచెందగా.. బుధవారం ఆయన మృతదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లుతోపాటు, పలు పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి పూలమాలలతో ఘనంగా నివాళి అర్పించారు. అలాగే స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు బండి పుల్లారావు, మందపాటి మోహన్‌రెడ్డి, యూఎస్ ప్రకాశ్‌రావు, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నాయకులు మృతదేహాన్ని సందర్శించి కుటుంబీకులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తల్లులతోనే పిల్లల ఆరోగ్యం


అశ్వారావుపేటరూరల్: ఊట్లపల్లి కేంద్రంలో చిన్నారులకు బహుమతి అందిస్తున్న ఎంపీటీసీ

చంద్రుగొండ: తల్లులు ఆరోగ్యంగా ఉంటేనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మలాజ్యోతి అన్నారు. మండలంలోని పోకలగూడెం సెక్టార్ పరిధిలో గానుగపాడు, అన్నారంతండా, సత్యనారాయణపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం తల్లులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తల్లులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శకుంతల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక దృష్టి సారించాలి

అశ్వారావుపేటరూరల్: బరువు తక్కువగా ఉండే చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టి, బరువు పెరుగుదల కోసం వారికి బాలామృతం ప్లస్ ఇవ్వాలని సీడీపీఓ రోజారాణి అన్నారు. మండల పరిధిలోని గాండ్లగూడెం, ఊట్లపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం తల్లిదండ్రులతోపాటు సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బలమైన ఆహారాన్ని ఇవ్వడంతోపాటు పిల్లలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. ఊట్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ డే నిర్వహించి చిన్నారులకు బహుమతులు అందించారు. సర్పంచ్ సాధు జోత్స్నబాయి, ఉప సర్పంచ్ హలవతు భీకు, ఎంపీటీసీ సభ్యులు కే రామకృష్ణ, కార్యదర్శి నాగేశ్వరరావు, అంగన్‌వాడీ టీచర్ బండారు కేధారేశ్వరి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్లు ఊడుస్తూ వీఓఏల నిరసన


పినపాక: రోడ్డు ఊడుస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న వీవోఏలు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ఐకేపీ వీఓఏల ఆందోళన బుధవారం పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రోడ్లు ఊడుస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. వీరికి పలువురు నాయకులు సంఘీభావం తెలిపి కార్యక్రమంలో పాల్గొన్నారు. వీఓఏల న్యాయమైన డిమాండ్లను సత్వరమే ఆమోదించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయా పార్టీల, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


అశ్వాపురంలో..


దుమ్ముగూడెంలో..


చంద్రుగొండలో..


అన్నపురెడ్డిపల్లిలో..

బదిలీ అధికారులకు ఘన సన్మానం


మణుగూరుటౌన్: జీఎం (సివిల్) రమేష్‌బాబును సన్మానిస్తున్న మణుగూరు జీఎం రాంచందర్

మణుగూరుటౌన్: సింగరేణి సంస్థలో 34 సంవత్సరాలుగా పనిచేస్తూ.. ఈ నెలలో పదవీ విరమణ పొందనున్న ఏరియా జీఎం (సివిల్) రమేష్ బాబును ఏరియా జీఎం దుర్గం రాంచందర్ బుధవారం ఘనంగా సత్కరించారు. రమేష్‌బాబు నిజాయితీ నిబద్ధతతో పనిచేసి సంస్థ అభివృద్ధికి కృషి చేశారని ఈ సందర్భంగా జీఎం దుర్గంచందర్ అన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, పీఓ లక్ష్మీపతిగౌడ్, పీఓ శ్రీనివాసచారి, ఏఎస్ఓ వెంకటరమణ, డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్, కె.వెంకట్‌రావు, డీజీఎం (పర్చేజ్) శ్రీనివాసమూర్తి ఫైనాన్స్ అనురాధ, సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్, సీనియర్ ఎస్టేట్ అధికారి బాబుల్‌రావు, డీవైఎస్ఈ రాజేంద్రప్రసాద్, ఈఈ ప్రవీణ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ ప్రాజెక్ట్ మేనేజర్‌గా పని చేస్తూ శ్రీరాంపూర్ భూగర్భగని ఏజెంట్‌గా పదోన్నతి బదిలీపై వెళ్తున్న మాలోత్ రాముడును బుధవారం ఓసీ–2 అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఓసీ2 సీ రిలే ఇన్‌చార్జ్ భూక్యా భాంగ్యా, టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్ రావు మాట్లాడారు. కార్యక్రమంలో ఓసీ2 అధికారులు బి.బాబ్జీ, కృష్ణమూర్తి, సూపర్‌వైజర్లు కోడి శ్రీనివాస్, సుకుమార్,దేవేష్, కిరణ్, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 29న పదవీ విరమణ పొందనున్న మండలంలోని బాలాజీనగర్‌కు చెందిన సామా శ్రీనివాస్‌రెడ్డి, వాగుమల్లారం గ్రామానికి చెందిన నామా వెంకటేశ్వరరావులను పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు బుధవారం వారి గృహాలకు వెళ్లి పుష్పగుచ్చాలు అందజేశారు. శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు ముత్యం బాబు, అడపా అప్పారావు, బొలిశెట్టి నవీన్, వట్టం రాంబాబు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రామిరెడ్డి, యువజన నాయకులు మిట్టపల్లి సాగర్, రవిప్రసాద్, హర్షనాయుడు, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రామదీక్ష విరమణ

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో గురువారం శ్రీరామపునర్వసు దీక్షా పరుల దీక్ష విరమణ కార్యక్రమం జరగనున్నట్లు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా 28వ తేదీన స్వామి వారికి పట్టాభిషేక మహోత్సవం ఉంటుందని, ఇందులో పాల్గొనదలిచిన దీక్షపరులు రూ.100 చెల్లించాలని వెల్లడించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

పినపాక: మండల పరిధిలోని జానంపేట కొత్తగుంపు గ్రామానికి చెందిన బండ్ల సత్యనారాయణ పాడి గేదె బుధవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. పొలంలో మేత మేస్తున్న సమయంలో తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తగిలి విద్యుత్ షాక్‌కు గురైనట్లు బాధితుడు తెలిపాడు. గేదె విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని, తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

గిరిజన గ్రామాల్లో జ్వర సర్వే

మణుగూరురూరల్: మండల పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామాలైన ఖమ్మం తోగు, బుగ్గ, బుడుగులలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం జ్వర సర్వేను నిర్వహించారు. ఈ సర్వేలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామస్తులందరి రక్తనమూనాలను సేకరించి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేశారు. పరీక్షల్లో ఇద్దరికి మలేరియా నిర్ధారణ కావడంతో ఏసీటీ కిట్లను పంపిణీ చేసి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఉమేష్, రోజా, రాధ, పుష్ప, మంగ పాల్గొన్నారు.


మృతుడి కుటుంబానికి వితరణ

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం గ్రామానికి చెందిన మృతుడు జినుగు సంపత్‌కుమార్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కాటిబోయిన నాగేశ్వరరావు, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్‌లు బుధవారం పరామర్శించారు. 25 కేజీల బియ్యం, రూ.2వేల నగదును వితరణగా అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొత్తపల్లి సత్యనారాయణ, కలబోయిన మాధవరావు, లతీఫ్, కన్నెబోయిన లాలు, చింటూ, మహేష్, నరేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన

అశ్వాపురం: మండలంలోని తురుములగూడెం, జగ్గారం, అమ్మగారిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, కల్లాలను బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. అకాల వర్షాల దృష్ట్యా నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి , ప్రధాన కార్యదర్శి రహీంఖాన్, మండల అధ్యక్షుడు బొల్లినేని సురేష్, మహిళా నాయకురాలు వరలక్ష్మి, యాకయ్య, లింగస్వామి, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించాల్సిందే..


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య

చంద్రుగొండ: ఓవైపు ఆర్థికంగా బడాబాబులకు దోచిపెడుతూ మరోవైపు మతవిద్వేషాలు రేపుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించాల్సిందేనని సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య పిలుపునిచ్చారు. మండలకేంద్రం చంద్రుగొండలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన ఆ పార్టీ మండలశాఖ సమావేశంలో కాసాని మాట్లాడారు. మోదీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతూ.. ఇదే అభివృద్ధి అంటూ ప్రచారం చేస్తోందని ఎద్దేవా చేశారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు కొండపల్లి శ్రీధర్, ఐలూరి రామిరెడ్డి, పెద్దిని వేణు,, రామడుగు వెంకటాచారి, రాయి రాజా, విప్పర్ల వెంకటేశ్వర్లు, సర్పంచ్ కాక సీత పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతులను ఆదుకోవాలి

మణుగూరుటౌన్: ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బి.అయోధ్య అన్నారు. బుధవారం మణుగూరు మండలంలోని పగిడేరు గ్రామంలో సీపీఐ నేతల బృందం ఇటీవల అకాల వర్షాలకు పాడైన పంట పొలాలను పరిశీలించారు. రైతుల పంట నష్టాన్ని అంచనా వేసి రుణమాఫీ చేయాలని, ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి నివేదిక అందజేస్తమని అన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, సీపీఐ మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు, జిల్లా సమితి సభ్యులు ఎస్కే సర్వర్, అక్కి నర్సింహారావు, స్థానికులు వేర్పుల వీరయ్య, సురేష్, శ్రీరాములు రైతులు పాల్గొన్నారు.

సేవలు మరువలేనివి..


మాట్లాడుతున్న పాకాల దుర్గాప్రసాద్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం మాజీ ఎమ్మెల్యే ముర్ల యర్రయ్యరెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. యర్రయ్యరెడ్డి వర్ధంతి సభను బుధవారం నిర్వహించగా, రాజకీయ, ఆదివాసీ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా కొనసాగిన యర్రయ్యరెడ్డి.. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటాలు చేశారని పలువురు గుర్తు చేశారు. కాగా, పట్టణంలో యర్రయ్యరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ముర్ల రమేష్ అధ్యక్షత వహించగా తిప్పని సిద్దులు, పాకాల దుర్గాప్రసాద్, సింగ్ నరసింహారావు, మచ్చా వెంకటేశ్వర్లు, బండారు తిలక్, ఎస్‌కె.అజీం, వాళ్ల రంగారెడ్డి, కెచ్చెల దేవి, కోట దేవదానం, చిచ్చడి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు భారతం, రామాయణం, భాగవతం అంశాలపై వికాస తరంగిణి యువ వికాస్ ఆధ్వర్యంలో బుధవారం క్విజ్ పోటీ నిర్వహించారు. అనంతరం యువతకు ఆధ్యాత్మిక, క్రీడా, వ్యక్తిత్వ నైపుణ్యాలు పెంచుడానికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ స్త్రీల వైద్యురాలు జయభారతి కళాశాలకు మంచినీటి కూలర్‌కు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో యువ వికాస్ సమన్వయ కర్త చారుగుళ్ల శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ డి.భద్రయ్య, వేముల కామేశ్వరరావు, గట్టు వెంకాచార్య, నాగేశ్వరరావు, కిరణ్, వీరాస్వామి, వెంకటరమణ, బాలాజీ, సురేష్ పాల్గొన్నారు.

దుస్తుల వితరణ

భద్రాచలంఅర్బన్: స్థానిక గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో చేపట్టిన కల్పవృక్షం స్టాల్‌లో బుధవారం ఆ సంస్థగౌరవాధ్యక్షుడు బోగాల శ్రీనివాస రెడ్డి తన 25 జతల దుస్తులను అందించారు. ఇళ్లలో వాడకుండా పక్కన ఉంచిన వస్తువులు, దుస్తులను కల్పవృక్షం స్టాల్‌లో అందిస్తే.. వాటిని అవసరం ఉన్న పేదలకు అందిస్తారు. కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు కామిశెట్టి కృష్ణార్జునరావు, గౌరవాధ్యక్షుడు డాక్టర్ గోళ్ల భూపతి రావు, కోశాధికారి శ్రీరంగం సంపత్, గాంధిరెడ్డి పాల్గొన్నారు.

తలకొరివి పెట్టిన తనయ

పినపాక: కన్న కొడుకులు లేకపోవడంతో కూతురు తండ్రికి తలకొరివి పెట్టిన ఘటన మండలంలోని ఈ బయ్యారం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నూతి రాజయ్య (65) కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరూ కూతుర్లే అవడంతో చిన్న కూతురు రమణ తలకొరివి పెట్టింది. కోరుతున్నాడు.

ఘనంగా నిర్వహించాలి

భద్రాచలంఅర్బన్: ప్రజలు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాబోయే మేడేను కార్మికవర్గం, ప్రజలు వాడ వాడలా ఘనంగా నిర్వహించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి అకోజు సునిల్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన మేడే సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ నాయకులు బల్లా సాయి కుమార్, మారెడ్డి శివాజీ, నాయుడు, సింగు, కొటి, లంకపల్లి విశ్వనాద్, గడ్డం నాగమ్మ, అందుర్తి వెంకట్రావు, అయినలా రామకృష్ణ, శివ రాంకి, తిరుపతి, వింజం సాయి తదితరులు పాల్గొన్నారు.

కేసులు నమోదు చేయాలి

దుమ్ముగూడెం: మండలంలో ఎటువంటి అనుమతులూ బహుళ అంతస్తులు నిర్మిస్తున్న వారిపై ఎల్‌టీఆర్ కేసులు నమోదు చేయాలని దళిత హిందు మాలనాడు వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి వెంకట్రాజు డిమాండ్ చేశారు. బుధవారం నర్సాపురంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లక్ష్మీనగరం గ్రామంలో అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల ఇళ్ల నిర్మాణాలు చేపట్టినప్పటికీ మండల అధికారులు చర్యలు తీసుకోలేదని అన్నారు. బొర్రా నాగయ్య, నాగమణి, ఆదినారాయణ పాల్గొన్నారు.